సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 12 । జనవరి । 2024

ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త..!

పండుగకు ఊరెళ్తున్నారా జర జాగ్రత్త.. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలు జరిగే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



8లో▸



మార్లవాయిని అభివృద్ధి చేస్తాం

మార్లవాయిలో గురువారం డార్ఫ్ దంపతుల వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై నివాళులర్పించారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.2 /18.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. జిల్లాలో చలి ప్రభావం కొంత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎరువుల దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. వ్యాపారుల గోదాముల్లో ఎరువుల నిల్వలు ఈ–పాస్‌లోని వివరాలతో సరిపోల్చారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు చేయకుండా ఎరువుల అమ్మకాలు చేపట్టొద్దని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు వారానికి పది దుకాణాల చొప్పున తనిఖీ చేస్తున్నామని తెలిపారు. వ్యాపారులు నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏవో ఖాదర్ హుస్సేన్ ఉన్నారు.

కాగజ్‌నగర్ బల్దియాకు 59వ ర్యాంకు

కాగజ్‌నగర్‌టౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సర్వేలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో 59 ర్యాంకు దక్కింది. జోనల్ స్థాయిలో 34వ ర్యాంకు సాధించింది. గతేడాది కాగజ్‌నగర్ బల్దియా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం(మున్సిపాలిటీ) కింద రెండో ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024– 25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆరో తరగతిలో వంద సీట్లు, 7 నుంచి పదో తరగతి వరకు పలు సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ముగిసిన ఎంపీపీ కప్ పోటీలు



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ వేణు, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఎంపీపీ కప్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ వేణు, డీఈవో అశోక్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆటల్లో గెలుపోటములు సహజమేనని పేర్కొన్నారు. కబడ్డీలో బాలురు, బాలికల విభాగంలో బూర్గుడ ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి సాధించగా ద్వితీయ స్థానంలో బాలికల విభాగంలో గుండి పాఠశాల, బాలుర విభాగంలో సెయింట్ మేరీ స్కూల్ జట్టు నిలిచింది. అలాగే ఖోఖో ప్రథమ బహుమతి బాలికల విభాగంలో వాసవి స్కూల్, బాలుర విభాగంలో గుండి పాఠశాల సాధించాయి. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, ఆర్డీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో సాంకేతిక విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యాం కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఏటా 6 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత చదువుల కోసం వీరు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాలిటెక్నిక్, ఐటీఐ, అగ్రికల్చర్ డిప్లొమా తదితర కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. తిర్యాణిలో రూ.2కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. నాయకులు శ్రీకాంత్, ముజంబిల్, శ్రీకాంత్, రషీద్ పాల్గొన్నారు.

సకినాల సంక్రాంతి

- ప్రతీ ఇంటా పిండివంటకాల ఘుమఘుమలు
- తయారీలో మహిళలు బిజీబిజీ
- సందడిగా మారిన గ్రామాలు
- ఇళ్లలో చేసుకోలేని వారి కోసం ప్రత్యేక సెంటర్లు



కెరమెరిలో సకినాలు పోస్తున్న మహిళలు

సంక్రాంతి సందడి మొదలైంది. విద్యా సంస్థలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఇళ్లకు చేరుకున్నారు. ఏ ఇంటా చూసినా సంక్రాంతి ప్రత్యేక వంటకాల తయారీ దృశ్యాలే కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా సకినాల ఘుమఘుమలు ఊరిస్తున్నాయి. మహిళలు ఒకరికొకరు సాయం చేసుకుంటూ సకినాలు పోస్తూ.. గారెలు చేస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. జిల్లా కేంద్రంలో కొంతమంది పిండి వంటల తయారీతో స్వయంఉపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి అందిస్తున్నారు. వినియోగదారుల అభిరుచికి తగ్గట్లు ఆర్డర్లు స్వీకరిస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

కట్టెల పొయ్యిపై అదిరే రుచులు



కెరమెరిలో సకినాలు కాలుస్తున్న మహిళలు

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. నాలుగైదు రోజుల ముందు నుంచే ఇక్కడి మహిళలు సకినాలు, అప్పాలు, గారెల తయారీలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు సెలవులపై ఇళ్లకు చేరుకోవడంతో వారు సైతం వంటల్లో పాలుపంచుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలందరూ ఒకచోటుకు చేరి సకినాలు పోస్తున్నారు.

ఒకరికొకరు సాయం



సంక్రాంతి పండుగ అంటేనే పిండి వంటలకు ప్రత్యేకం. అందులోనూ సకినాలకు ప్రాధాన్యం ఉంటుంది. రెండు, మూడు రోజుల ముందు నుంచే సకినాలు, అరిసెలు చేస్తున్నాం. ఒకరికొకరం సాయం చేసుకుంటూ సకినాలు చేయడం ఆనందంగా ఉంటుంది.

– సుర్పం శోభ, కెరమెరి

20 ఏళ్లుగా పిండి వంటకాలు



సకినాలు పోస్తున్న మార స్వరూప

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రావులవాడకు చెందిన మార స్వరూప 20 ఏళ్లుగా పిండి వంటకాల తయారీ వృత్తిలో కొనసాగుతున్నారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీ పడకుండా వినియోగదారుల నుంచి ఆదరణ పొందుతోంది. పండుగ సమయాల్లో దాదాపు మూడు క్వింటాళ్ల సకినాలు, అరిసెలు, చెకోడీలు, సాచా, పప్పు బిళ్లలు, చుడ్వా, మురుకులు తయారు చేస్తుంది. వీటితోపాటు ఇడ్లీ, దోశలు తదితర టిఫిన్లు కూడా విక్రయిస్తూ ఆదాయం పొందుతోంది. ఇష్టమైన పని చేయడంలో తన భర్త సురేశ్ సహకారం మరువలేనిదని, పలువురి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉందని స్వరూప తెలిపారు.

స్వయం ఉపాధి



పిండి వంటకాలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: టిఫిన్స్‌తోపాటు పిండి వంటకాలు విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతుంది జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడకు చెందిన పిన్నా వనిత. ప్రతిరోజూ ఉదయమే వివిధ రకాల టిఫిన్లు తయారు చేసి కాలనీల్లో విక్రయిస్తుంది. అలాగే ఆర్డర్లపై భోజనాలు సరఫరా చేస్తూ నెలకు రూ.40 వేల వరకు ఆదాయం పొందుతుంది. టిఫిన్ల తయారీలో తోటి కోడళ్ల సహాయ సహకారాలు తీసుకుంటూ ముందుకు సాగుతుంది. సకినాలు, గారెలు, అరిసెలు, కారపూస, కరిజలు, నువ్వుల లడ్డు తదితర పిండివంటకాలు సైతం తయారు చేస్తుంది.

సంబురంగా జరుపుకొంటాం



కౌటాల: సంక్రాంతి పండుగను ఏటా సంబురంగా జరుపుకొంటాం. ఇప్పటికే అన్ని రకాల రంగులు కొనిపెట్టాం. గ్రామంలో నిర్వహించే ముగ్గుల పోటీలో పాల్గొంటా. పండుగకు కూతుళ్లు, అల్లుళ్లు వస్తారు. మూడు రోజులపాటు ప్రత్యేక పిండి వంటలు కార్యక్రమాలే ఉంటాయి.

– మార్త చంద్రకళ, గృహిణి, కౌటాల

వారం ముందు నుంచే..



పండుగకు వారం రోజుల ముందు నుంచే పిండి వంటలు చేస్తున్నాం. సకినాలు, అరిసెలు, లడ్డూలు వంటివి చేశాం. ఆరు రోజులు సెలవులు రావడంతో పిల్లలు ఇంటికి వచ్చారు. ఇళ్లంతా సందడిగా ఉంది. మా కాలనీలో కలిసికట్టుగా పండుగ జరుపుకొంటాం.

– మల్లొజ్జల సౌమ్య, కౌటాల

ఇళ్లంతా ఘుమఘుమలు



రెబ్బెన: సంక్రాంతి వచ్చిందంటే ఇళ్లంతా పిండి వంటకాలతో ఘుమఘుమలే. పండుగ స్పెషల్ సకినాలను తప్పనిసరిగా చేసుకుంటాం. పంటలు ఇంటికి వచ్చిన వేళ జరుపుకొనే ఈ పండుగకు మురుకులు, గారెలు కూడా చేసుకుంటాం. ఇరుగుపొరుగు వాళ్లతో కలిసి పిండి వంటకాలు తయారు చేసుకుంటాం.

– మన్కు అనూష, గోలేటి

తెలంగాణ స్పెషల్



రెబ్బెన: సంక్రాంతికి అందమైన ముగ్గులు వేయడంలో పోటీ పడుతాం. పండుగ రోజు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేస్తాం. తెలంగాణలో సంక్రాంతి పండగకు సకినాలు ఎంతో స్పెషల్. సకినాలు చేయడంలో.. తినడంలోలోనూ ఆరోగ్యకరమైన లాభాలు ఎన్నో ఉన్నాయి.

– లగిశెట్టి ధనలక్ష్మి, గంగాపూర్

ఊరంతా సందడి



రెబ్బెన: వారం ముందు నుంచే ఊర్లో అంతా కలిసి ఒకరి ఇంట్లో ఇంకొకరు సహాపడుతూ పిండి వంటకాలు తయారు చేసుకుంటాం. పనుల కోసం వేరే గ్రామాలకు వెళ్లిన వారు, అత్తవారింటికి వెళ్లిన ఆడకూతుళ్లు పుట్టింటికి వస్తారు. పిల్లలకు సెలవులు రావడంతో సందడిగా అనిపిస్తుంది.

– చాపిడి శైలజ, రాంపూర్

పీవీటీజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: పీవీటీజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీవీటీజీల అభివృద్ధి, పోషణ్ వాటిక, ప్రజాపాలన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ ప్రక్రియపై గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పీవీటీజీ గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జిల్లాలో ఆయా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ నెల 15న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా పీవీటీజీ లబ్ధిదారులతో మాట్లాడే కార్యక్రమం ఉన్నందున జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గిరిజనులు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని అన్నారు. జిల్లాలోని 50 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 20లోగా పోషణ్ వాటికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఐదు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి అందిన దరఖాస్తుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ఈ నెల 17 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవోలు, ఐసీడీఎస్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

సెలవులు వచ్చేశాయ్..!



కెరమెరి: ఆశ్రమ పాఠశాలల నుంచి ఇంటిబాట..



జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాల వద్ద..

కెరమెరి/ఆసిఫాబాద్‌రూరల్: సంక్రాంతి సెలవులు వచ్చేశాయ్.. శుక్రవారం నుంచి ఈ నెల 17 వరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో జిల్లాలోని ఆశ్రమ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, తదితర వసతి గృహాల్లోని విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా 1263 పాఠశాలలు ఉండగా దాదాపు 92 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇళ్లకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో బస్టాండ్లలో రద్దీ కనిపించింది. మళ్లీ ఈ నెల 18న విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్నాయి.

జాడ చిక్కని మూడో పులి

- ముమ్మర గాలింపు చేపడుతున్న అటవీశాఖ
- అధికారుల విచారణ తీరుపై ఆదివాసీ సంఘాల ఆగ్రహం
- మైనర్లను హింసించారంటూ ఆందోళన



కాగజ్‌నగర్ అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: కాగజ్‌నగర్ డివిజన్‌లో పులుల మృతి రోజుకో మలుపు తిరుగుతోంది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోని దరిగాం, షెర్కపల్లి అటవీప్రాంతంలో పులుల వరుస మరణాలు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. మొదట కే15 పులిని ఘర్షణలో మృతిచెందినట్లు అటవీ అధికారులు తెలపగా.. అనుమానాస్పద స్థితిలో ఎస్9 కళేబరం లభించింది. పులులపై విష ప్రయోగం కోణం అటవీఅధికారులు విచారణ చేపట్టారు. ఎస్9 పులి విషం చల్లిన పశుమాంసాన్ని తిన్నట్లు అటవీ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. కెమెరాకు చిక్కిన చిత్రాల్లో కే15తో పాటు ఎస్9, మరో పులి ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

ముమ్మరంగా గాలింపు

కే15, ఎస్9తో పాటు ఉన్నట్లుగా భావిస్తున్న మూడో పులి కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. విష ప్రయోగంపై పూర్తి వివరాలు ఫొరెన్సిక్ నివేదిక వచ్చిన అనంతరమే తెలిసే అవకాశముంది. కానీ విషప్రయోగం కోణంలో విచారణ చేపట్టిన అటవీ అధికారులకు మూడో పులి జాడ తెలుసుకోవడం తప్పనిసరిగా మారింది. సీసీఎఫ్ శాంతారాం ఆధ్వర్యంలో జన్నారం, మంచిర్యాల, చెన్నూర్ తదితర ప్రాంతాల నుంచి సిబ్బందిని బృందాలుగా విభజించి గాలింపు చర్యలు చేపట్టారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ఫారెస్టు డివిజన్‌లోని దరిగాం, సర్కెపల్లి అటవీప్రాంతాలైన రింగరేట్, లైన్‌గూడ, షర్కెపల్లి తదితర ప్రాంతాల్లో అడవిని జల్లెడ పడుతున్నారు. మూడు రోజులుగా గాలింపు నిర్వహిస్తున్నా నేటికీ మూడో పులి జాడ మాత్రం లభించలేదు. మూడో పులి విషప్రభావానికి గురైతే కళేబరం లభించే అవకాశాలు ఉన్నాయి. అధికారులకు మరే పులి జాడ పూర్తిస్థాయిలో దొరకకపోవడంతో ఇతర ప్రాంతానికి వెళ్లాయా.. మరేదైనా కుట్ర జరిగిందా.. అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



దరిగాం అటవీ ప్రాంతంలో సిబ్బంది గుడారాలు

తల పట్టుకుంటున్న అటవీశాఖ

2023 వరకు పులుల ఉనికితో రాష్ట్రంలోనే కాగజ్‌నగర్ డివిజన్ అటవీశాఖ ప్రత్యేకంగా నిలిచింది. 2024 ఆరంభంలోనే పులులు మరణించడం అటవీశాఖకు నిద్ర లేకుండా చేసింది. డివిజన్‌లో మొత్తం 11 లేదా 12 పెద్దపులుల ఉన్నట్లుగా రికార్డులు చెబుతుండగా, కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని దరిగాం, అంకుసాపూర్ అటవీప్రాంతంలో ఆరు పులులు నివాసం ఏర్పర్చుకున్నట్లుగా అటవీ అధికారులు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పోలీసుశాఖ సహాయం తీసుకుంటున్నా పులులకు ఏమైందో ఇప్పటికీ ధృవీకరించలేకపోయారు. విచారణ కోసం ఇక్కడికి వచ్చిన పీసీసీఎఫ్ రాకేశ్ డోబ్రియాల్ డివిజన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. పులుల సంరక్షణపై అధికారుల తీరును ఆయన తప్పుబట్టారు. ఆరు పులుల ఉన్న కాగజ్‌నగర్ డివిజన్‌లో కాకుండా పులుల ఆచూకీ లేని జన్నారంలో ప్రధాన అధికారి ఉండడాన్ని ప్రశ్నించారు. అంకుసాపూర్, దరిగాం వద్ద కనీసం బేస్‌క్యాంపు నిర్మించి కనీసం వాచర్లను ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పులుల ఉనికి, దాడులకు సంబంధించి సమగ్రమైన నివేదిక లేకపోవడాన్ని ఎత్తిచూపిన రాష్ట్ర ఉన్నతాధికారి చర్యలు తప్పవనే హెచ్చరికలు చేశారు.

మైనర్లపై చిత్రహింసలు..!

కాగజ్‌నగర్ డివిజన్ అటవీశాఖ అధికారులు అత్యుత్సాహం ఆదివాసీల ఆగ్రహానికి కారణమైంది. పులులపై విషప్రయోగం చేశారనే కారణాలతో దరిగాం, షెర్కపల్లి, రింగరేట్ గ్రామానికి చెందిన 8 మందిని కాగజ్‌నగర్ డివిజన్‌కు తరలించారు. వీరిలో ఇద్దరు మైనర్ కాపరులు కూడా ఉన్నారు. వీరందరినీ విచారణలో భాగంగా చిత్రహింసలకు గురిచేసినట్లుగా ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గురువారం రాత్రి వరకు ఆదివాసీ సంఘం నాయకులు, మాజీ జెడ్పీచైర్మన్ సిడాం గణపతి ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అధికారులు చర్చలు జరిపి ఇద్దరు మైనర్లను తల్లిదండ్రులకు అప్పగించారు. బయటకు వచ్చిన మైనర్లు విలేకరులతో మాట్లాడుతూ.. అటవీశాఖ అధికారులు తమను కొట్టారని, చిత్రహింసలకు గురిచేశారని, మాటలతో వేధించారని ఆరోపించారు.

క్లుప్తంగా

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.35వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు చెప్పారు. సీఐ సాదిక్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన అత్యాచారం ఘటనలో రవీంద్రనగర్‌కు చెందిన సత్యజిత్ మండల్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు. అప్పటి సీఐలు బి.శ్రీనివాస్, బుద్దస్వామి, డి.మోహన్ విచారణ చేపట్టారు. అనంతరం సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేసి, ఫోక్సో కేసులో పోలీసులు సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ప్రసాద్ వాదించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా జిల్లా లైజనింగ్ ఆఫీసర్ కె. సాగర్, హెడ్ కానిస్టేబుల్ బాబాజీలను ఎస్పీ సురేశ్ కుమార్ అభినందించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లిలో గురువారం చోరీ జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాపల్లికి చెందిన గుండ ఐలయ్య తన భార్య లక్ష్మితో కలిసి చేను పనుల్లో భాగంగా ఇంటికి, గేట్‌కు తాళం వేసి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి గేట్ తాళం తీసి ఇంట్లోకి వెళ్లే క్రమంలో ఇంటి తలుపు బెడెం విరగ్గొటి ఉంది. అనుమానం వచ్చి వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూంలోని వస్తువులు, బట్టలు చిందరవందరగా ఉండి బీరువా తలుపులు తీసి ఉన్నాయి. బీరువాలోని రూ.70 వేల నగదుతోపాటు తులం బంగారు గొలుసు, 18 తులాల వెండి గొలుసులు చోరీకి గురయ్యాయి. వీటి విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని గుర్తించారు. బాధితుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎండీని కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి సీఎండీ బాధ్యతలు చేపట్టిన బలరాంను సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆ సంఘం అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆలవేందర్ వేణుమాధవ్‌లతో పాటు పలువురు సీఎండీని మర్యాదపూర్వకంగా కలిసి నూతనంగా బాధ్యతలు చేపట్టడడంతో శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ఆసుపత్రుల్లో అపరిమిత వైద్య సేవలు అందించాలన్నారు. సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డులో నిమ్స్ టారిఫ్‌లో 40 శాతం కోత విధించరాదని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కంచ భీరయ్య, ప్రసాద్, పూర్ణ ప్రకాశ్, జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకులు..

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు సింగరేణి సంస్థ నూతన సీఅండ్ఎండీ బలరాం నాయక్‌ను గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ గోలేటి ఓసీపీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బెల్లంపల్లిలోని ఏరియా ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. సీనియర్ నాయకులు ప్రకాష్‌రావు, కార్యదర్శి మాదవకృష్ణ, నాయకులు చంద్రకుమార్, రామారావు, నారాయణ, సోగాల వామన్, కందుల తిరుపతి ఉన్నారు.

ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త..!



- పండుగ వేళ పోలీసులకు సమాచారం ఇవ్వండి
- విలువైన నగలు, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోండి
- చైన్‌దొంగలతో అప్రమత్తత అవసరం

మంచిర్యాలక్రైం: సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్నారా జర జాగ్రత్త.. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో అధిక రద్దీ ఉంటుంది. బస్సు, రైలు ఎక్కేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. జనం గుంపులు గుంపులుగా ఉండడమే అదనుగా భావించి చైన్‌దొంగలు, పిక్ పాకెటర్స్ మాటు వేసి చేతివాటం ప్రదర్శిస్తారు. మరికొందరు మాయమాటలు చెప్పి సహాయం చేస్తామని మోసాలకు పాల్పడే వారూ ఉంటారు. పండుగ, పిల్లలకు పాఠశాలల సెలవుల నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల నుంచి ఊర్లకు వెళ్తుంటారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడుతుంటారు. ఈ నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఊరు వెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ నిఘా ఉంటుందని, ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

ఇవి పాటించండి..

- ఊర్లెళ్లేవారు పక్కింటి వారికి చెప్పాలి, లేదా వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఎన్ని రోజులు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎప్పుడు వస్తారో పక్కా సమాచారం ఇవ్వాలి.
- అతి తక్కువ ధరకు దొరికే వైఫై బేస్‌డ్ రోబో కెమెరా అమర్చుకోవాలి. దీని నుంచి మీ ఇంట్లో జరిగే విషయాలు మీ సెల్‌ఫోన్‌కు అలర్ట్ రింగ్ టోన్ వస్తుంది. అది వారికి వినిపించదు. వారు దొంగతనం చేస్తుండగానే పట్టుకునే అవకాశం ఉంటుంది. ఇది ఏవైనా నాలుగు సెల్‌ఫోన్లకు వినియోగించుకోవచ్చు. ఒక్కటి పోలీస్ అధికారి నంబర్‌కు సైతం వాడుకోవచ్చు. సుమారు దీని ధర రూ.2500 ఉంటుంది. వైఫైతోపాటు ఎస్‌డీ కార్డ్ అదనంగా కంపెనీ వారు అందిస్తున్నారు.
- మార్కెట్‌లో సైరన్ మోగే తాళాలు సైతం అతి తక్కువ ధరలో లభిస్తున్నాయి. దానిని కదిలించే ప్రయత్నం ఎవరు చేసినా సైరన్ మోగుతుంది. దీంతో పక్కవారు అప్రమత్తం అయ్యే అవకాశం ఉంది.
- తాళం వేసి అది కనిపించకుండా డోర్ కర్టెయిన్ కప్పి ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంటి ముందు ఉన్న గేటుకు తాళం వేయకపోవడం మంచిది, బెడ్‌రూంలో లైట్ వేసి ఉంచాలి.

సమాచారం ఇస్తే భద్రత కల్పిస్తాం..



ప్రజల భద్రత, ఆస్తుల రక్షణకు మేమున్నాం. నిర్భయంగా సమాచారం ఇవ్వండి రక్షణ కల్పిస్తాం. పట్టణంలో 24గంటలు నాలుగు బ్లూ కోల్ట్స్ బృందాలు తిరుగుతున్నాయి. 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే ఐదు నిమిషాల్లో పోలీసులు మీ దగ్గర ఉంటారు. ఊర్లకు వెళ్లేవారు ముందుగానే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ప్రయాణంలో చైన్ స్నాచర్స్‌తో అప్రమతగా ఉండండి.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

- నగలు, నగదు బీరువాల్లో దాచిపెట్టకపోవడం మంచిది.
- నగదు డబ్బులు, ఆభరణాలు బ్యాంకుల్లో భద్రపర్చుకోవడం ఉత్తమం.
- అపార్ట్‌మెంట్‌లో ఉండేవారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- కొత్తగా ఎవరైనా అద్దెకు దిగినవారి పూర్తి వివరాలు సేకరించాలి. అవసరమైతే వారి ఆధార్ కార్డ్, ఏం చేస్తుంటారో, సొంత ఊరు ఎక్కడ అనే వివరాలు తెలుసుకోవాలి. వారి ఇంటికి వచ్చిపోయేవారి వివరాలు సేకరిస్తే మరీ మంచిది.
- మహిళలు బయటకు వెళ్లేముందు విలువైన నగలు ధరించకపోవడం మంచిది. నగలు కనిపించకుండా చీరకొంగు లేదా చున్నీ మెడ చుట్టూ కప్పుకోవాలి.
- గుర్తు తెలియని వ్యక్తులు మన పరిసర ప్రాంతాల్లో తిరిగినప్పుడు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

పిల్లలూ.. జర భద్రం



మంచిర్యాల కేజీబీవీ నుంచి ఇంటికి వెళ్లుతున్న విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: పిల్లలు జాగ్రత్తగా ఉండండి.. ఇంటి దగ్గర చదువుకోండి. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గరలో ఉన్నాయి. ఫార్మెటివ్ అసెస్‌మెంట్‌తోపాటు ప్రీ ఫైనల్ ఎగ్జామ్ ఉన్నాయి. కాస్త పుస్తకం పట్టేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోండి.. సెలవులు ముగియగానే మళ్లీ కేజీబీవీలకు రండి అంటూ కేజీబీవీల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు స్పెషల్ ఆఫీసర్ల సూచన ఇది..

సంక్రాంతి సెలవులు వచ్చేశాయ్..

సంక్రాతి పండుగకు ఈ నెల 12నుంచి 17వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. సంక్రాంతి సెలవులంటే కాస్త మక్కువ.. అమ్మమ్మ ఇంటికో.. నాన్నమ్మ దగ్గరికో వెళ్లాలని చిన్ననాటి ఊసులు మరోసారి పంచుకోవాలని పిల్లలు మారాం చేస్తుంటారు.. ఆమాటకొస్తే ఎప్పుడెప్పుడో సెలవులు వస్తాయోనని ఎదురు చూసే విద్యార్థులు సంక్రాంతి సెలవులతో గురువారం ఇంటిబాట పట్టారు. ఉదయం నుంచి తల్లిదండ్రులు పిల్లల కోసం విద్యాసంస్థలకు చేరుకున్నారు. దీంతో కేజీబీవీ, ఇతర



వసతితో కూడిన విద్యాలయాల వద్ద కోలాహలంగా మారింది. సెలవులు వేళ ఇదివరకు తెచ్చుకున్న వస్తువులు.. పుస్తకాలు అన్నింటినీ వెంట తీసుకెళ్లారు. తోటి విద్యార్థులతో కొంతసేపు కాలక్షేపం చేయడం.. ఫోన్‌నంబర్లు తీసుకోవడం కనిపించింది. 12 నుంచి సెలవులు ప్రకటించిన ముందు రోజు నుంచి కేజీబీవీల వద్ద బోసిపోయాయి. తిరిగి 18న విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయని విద్యాశాఖ ప్రకటించింది.

బస్సులు ఆపడం లేదని నిరసన

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని గురువారం రాత్రి పలువురు ప్రయాణికులు నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల నుంచి నిర్మల్, ఆదిలాబాద్ వైపు వెళ్లే బస్సులన్నీ సాయంత్రం నాలుగు గంటల నుండి కిక్కిరిసి రావడంతో బస్సులు ఆపలేదు. దీంతో విసిగిపోయిన ప్రయాణికులు రోడ్డుకు అడ్డంగా పడుకున్నాడు. అరగంట పాటు రోడ్డుపై అలాగే పడుకోవడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.



నిరసన తెలుపుతున్న ప్రయాణికుడు

పదోన్నతులతో పెరగనున్న బాధ్యత

శ్రీరాంపూర్: పదోన్నతులతో మరింత బాధ్యతగా పని చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఉద్యోగులకు ఎస్ఎల్పీ (సర్వీస్ లింక్డ్ ప్రమోషన్స్) ప్రమోషన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్‌లో మొత్తం 342మందికి ఎస్ఎల్పీ ప్రమోషన్లు అందిస్తున్నామన్నారు. ప్రతీ సంవత్సరం జనవరిలో వీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూజీఎం రఘుకుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, డీవైపీఎంలు రాజేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి, రాజేశ్, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

ఆర్కే 6 గనిలో...

ఆర్కే 6గనిలో 41మందికి ఎస్ఎల్పీ ప్రమోషన్ల పత్రాలను గని మేనేజర్ సంబంధిత ఉద్యోగులకు



పదోన్నతి పత్రాలను అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

అందించారు. ఉద్యోగులందరికీ ఈ ప్రమోషన్‌తో ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, పిట్ ఇంజినీర్ అండే శ్యాంకుమార్, సెక్షన్ ఇంజినీర్ మహేశ్, సీనియర్ పీవో సునీల్‌కుమార్, గుర్తింపు సంఘం నాయకులు ముస్కె సమ్మయ్య, సంఘం నాయకులు సదానందం, బాలసాని లక్ష్మణ్, చిలుక రాంచందర్, తోట మహేశ్ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

నస్పూర్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. గురువారం నస్పూర్ కాలనీలోని సింగరేణి స్టేడియంలో నిర్వహించిన రేడియంట్ పాఠశాల వార్షిక క్రీడోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు సైతం ఎంతో ముఖ్యమని వివరించారు. నూతనంగా నిర్మించిన సింగరేణి స్టేడియాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలను జనవరి 26న సింగరేణి స్టేడియంలోనే నిర్వహిస్తామని వెల్లడించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జీఎం సంజీవరెడ్డి

మంచిర్యాల ట్రాఫిక్ సీఐ కే.నరేష్, సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్, పాఠశాల కరస్పాండెంట్‌లు చెన్నూరి అఖిల, చెన్నూరి అమన్ ప్రసాద్, ప్రిన్సిపల్ రజని, ట్రస్మా నాయకులు మైదం రామకృష్ణ, ఊట్ల సత్యనారాయణ, అంబాల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సంస్థ చెలించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని సింగరేణి ఏరియా రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సాయిబాబా గుడి ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన తర్వాత పింఛన్‌పై ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. తమకు రావాల్సిన వేజ్‌బోర్డ్ ఏరియర్స్, గత ఆర్థిక సంవత్సరపు లాభాల వాటా, దీపావళి బోనస్, 2016 తర్వాత పెరిగిన గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులు ఆలస్యమైతే తాము సంఘంగా ఏర్పడి ఆందోళన



నిరసనలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు

లు చేయడానికి సమాయత్తమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు వాసాల శంకర్, రేణికుంట్ల కొమురయ్య, రవీందర్, నెల్లి వీరన్న, పోలు సంపత్, నాయిని శంకర్, దాసరి ఎల్లారం, ఇరుగురాల వెంకటి ఉన్నారు.

ప్రతిభ కనబరిచిన గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఇగ్నైట్ కాంపిటీషన్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. థీమాటిక్ పెయింటింగ్‌లో పదో తరగతికి చెందిన జి.అరుణ్ తేజకు మొదటి బహుమతి, తెలుగు భాషలో ఉపన్యాసానికి పి.అరుణ్‌కుమార్ మూడో బహుమతిని పొందారు. మొదటి బహుమతి విజేతకు రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు ఇచ్చినట్లు ప్రిన్సిపల్ కె. మోహన్ తెలిపారు.

పదోన్నతుల కోసం పరీక్ష ..



పరీక్షలో పాల్గొన్న ఉద్యోగి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గురువారం అసిస్టెంట్ చైన్‌మెన్, చైన్‌మెన్ పదోన్నతుల కోసం పరీక్షలు నిర్వహించారు. ఏరియాలో అసిస్టెంట్ చైన్‌మెన్ పోస్టులు 13 ఉండగా 22మంది ఇంటర్నల్ సర్వే మజ్దూర్‌లు దరఖాస్తు చేసుకోగా 21మంది పరీక్షకు హాజరయ్యారు. అలాగే 5 చైన్‌పోస్టులకు ఇద్దరు పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షల పర్యవేక్షణలో ఎస్వో టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్యాయ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఉన్నారు.

మార్లవాయిని అభివృద్ధి చేస్తాం



నివాళులర్పిస్తున్న ఎంపీ సోయం బాపూరావు, తదితరులు

- డార్ఫ్ దంపతుల రాకతో గ్రామానికి గుర్తింపు
- ఎంపీ సోయం బాపూరావు
- ఘనంగా హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతి

జైనూర్(ఆసిఫాబాద్): చారిత్రాత్మకమైన మార్లవాయి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. కుమురంభీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో గురువారం హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. డార్ఫ్ దంపతుల విగ్రహాలకు ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు ఆదివాసీలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మార్లవాయి గ్రామంలో ప్రధాన మంత్రి గ్రామీణ యోజన కింద అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆదిమ గిరిజనుల అభివృద్ధి, ఇళ్లు, రహదారుల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్లు కేటాయించిందన్నారు. ఐటీడీఏ ద్వారా ఇళ్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. జోడేఘాట్, జంగుబాయి, కేస్లాపూర్, ఇంద్రవెల్లి, పద్మల్‌పూరి కాకో ఆలయాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ జంగుబాయి క్షేత్రానికి రోడ్డు వేసేందుకు అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని ఎంపీకి విన్నవించారు. అలాగే మార్లవాయిలో రూ.2.34 కోట్లతో నిర్మిస్తున్న మినీ ట్యాంక్ బండ్ అసంపూర్తిగా ఉందని, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని కోరారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

డార్ఫ్ దంపతుల సేవలు చిరస్మరణీయం

ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మార్లవాయి గ్రామంలో నిర్వహించిన డార్ఫ్ దంపతుల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఆత్మ బంధువులు డార్ఫ్ దంపతులని అన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన 9 తెగలకు ప్రత్యేక స్థానం కల్పించారని అన్నారు. వారి కృషి ఫలితంగానే నేటికీ ఆదివాసీలకు ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ సర్పంచ్‌పై కేసు

బెజ్జూర్: మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పోర్తేటి రవిపై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సిద్దాపూర్ చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసేందుకు వెళ్లగా సర్పంచ్ రవి ప్రజలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బినామీ రేషన్ డీలర్‌గా ఉన్న అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ఐదు క్వింటాళ్ల బియ్యం సైతం అక్రమంగా అమ్ముకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బెజ్జూర్ డీలర్ పురుషోత్తంకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు.

గతంలో సైతం..

గత కొన్ని నెలల క్రితం దాదాపు 18క్వింటాళ్ల బియ్యం సైతం అమ్ముకోవడంతో పాటు రేషన్



బియ్యం స్టాక్ పరిశీలిస్తున్న డీటీ శ్రీనివాస్

షాప్ బినామీగా నడిపిన అతడిపై అధికారులు అప్పట్లో కేసు నమోదు చేశారు. సర్పంచ్ పదవి అడ్డుపెట్టుకొని బినామిలపై షాప్ తెచ్చుకొని నడుపుతున్నాడు. ఇతడిపై చీటింగ్ కేసు నమోదు చేయడంతో పాటు సర్పంచ్ పదవి నుంచి తొలగించాలని బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో పలువురు ఫిర్యాదు చేశారు.

రేషన్ డీలర్ సహా ఇద్దరిపై కేసు

వాంకిడి: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని 2411015 నంబరు రేషన్ డీలర్ వనపర్తి సునీత, ఆమె భర్త భాస్కర్ అలాగే సదరు డీలర్ వద్ద బియ్యం కొనుగోలు చేసిన ముజాహిద్‌లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి బియ్యం స్టాక్ నిల్వలు పరిశీలించగా 39.02 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై సదరు డీలర్‌ను విచారించగా స్థానికుడైన ముజాహిద్ అనే వ్యక్తికి అమ్మినట్లు తేలింది. దీంతో డీలర్‌తో సహా ఇద్దరిపై ఈసీ యాక్ట్ 1955 ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డీలర్ వద్ద నుంచి దాదాపు 45 క్వింటాళ్ల పీడీయస్ బియ్యం, ఈ-పోస్ డివైజ్, కాంటాను సీజ్ చేసి ప్రజల సౌకర్యార్థం బియ్యం పంపిణీకి సీజ్ చేసిన దుకాణం ఇన్‌చార్జి బాధ్యతలను షాప్ నంబర్ 2411014కు అప్పగించినట్లు తెలిపారు.



ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్న డీటీ